
# రాఘవరావు



మూలం:
హెర్బర్ట్

అనువాదం:
"శివం"

బొంబాయిలోగల మ్యూజియంలోని మూడవ అంతస్తులోని ఒక భాగం. కొద్ది క్షణాలు ఖాళీగా వుంటుంది. ఒక యువతి ఎడమ నుంచి విలాసంగా ప్రవేశించి స్టేజి ఎంట్రెన్సులోనే ఆగిపోయి, చేతిలోని వేలెట్‌ను త్రిప్పుతూ నిలబడిపోయి, వక్కసారి వెనక్కి తిరిగి చూస్తుంది, ఎవరికొరకో నిరీక్షిస్తున్నట్లు. ఆమె వయస్సు 19 కంటె ఎక్కువ వుండదు. ఖరీదైన దుస్తులతో అందంగా, నాజూకుగా వుంటుంది. ఉద్వేగంతో కూడిన చిర్నవ్వు ఆమె పెదవులపై లాస్యం చేస్తూంటుంది. ఏమీ ఎరగనట్లు ముందుకు చూస్తూండగా...

ఎడమవైపునుండే యువకు డొకడు ప్రవేశిస్తాడు. వయస్సు 21 వుంటాయి. ఎడమచేతిమీద కోటు వేలాడుతూ వుంటుంది. కుడిచేతిలో చిన్న పార్సెలు, భుజానికి వ్రేలాడుతూ బైనాక్యులర్స్, అతి నవీనంగావున్న అతను రాఘవ రావు.

అతను ప్రవేశించినట్లు ఆమెకు తెలుసు గాని, ఆ సంగతి ఎరగనట్లే వుంటుంది. అతను ఈల వేస్తూ ఆగి పోతాడు. ఆమె తన వంక చూడక పోవడం గమనించి, అఖరికి—]

రాఘు : అంత హడావుడిగా వచ్చేశారేం?

ఆమె : ఎవర్ని?

రాఘు : మిమ్మల్నే!

ఆమె : నన్నే?

రాఘు : అవును మిమ్మల్నే—

ఆమె : క్షమించాలి. మీరు పొరబడినట్లున్నారు—ఎవరిని చూసి ఎవరనుకున్నారో?

రాఘు : కాదు మీ సంగతే నేను చెపుతూంట...

ఆమె : నా సంగతా? అసలు మనిద్దరికీ పరిచయమైనా లేదే?

రాఘు : మీరు కాన్వెంట్‌లో చదువుతున్నారు కదూ?

ఆమె : కావచ్చు...

రాఘు : అవును... రెండేళ్ల క్రిందట ప్రతి రోజూ కాలేజీకి వెళ్తూ మిమ్మల్ని బస్సులో చూస్తూ వుండేవాడిని. అప్పుడూ ఏరోజు, కారోజు పలకరిద్దామని అనుకునే వాడిని, కాని ధైర్యం చాలేది కాదు. ఈవేళా అంతే అయింది. ఇన్నాళ్ల తర్వాత యిప్పుడు — మెరుపులా కనిపించే సరికి తప్పకుండా పిలుద్దామను కున్నాను.

ఆమె : పోనీ పిలవలేక పోయారా?

రాఘు : పిలవడం! పిల్చి పిల్చి గొంతుక ఎండిపోయింది...చాలా ముందున్నారు మీరు.

ఆమె : పిల్చేరా?...క్షమించండి— వినపడలేదు నాకు. మనం ఇందాక రెస్టారెంటులో కూడా కల్సుకున్నట్లున్నాం కదూ? అప్పుడయినా పలకరించేరు కారేం? (చేతిలోని పార్సెలు వంక చూపుతూ) ఇండియన్ ఇంక్ కొన్నట్లున్నారు — దేనికి?

రాఘు : (నవ్వి) తెల్లారి లేస్తే చేతులకు పులుముకునే దిదేగా!

ఆమె : రబ్బరు బేండ్సు ఏకంగా అన్ని కొనేశారు దేనికి?

రాఘు : నా వుద్యోగానికి అవి చాలా అవసరం లెండి—అయినా—మీరంత శ్రద్ధగా నన్ను పరిశీలిస్తున్నారని అనుకో లేదు సుమా!

ఆమె : మీ పక్క కౌంటర్ వద్దేగా నేను నిలబడింది! పైగా నాకు ఇతరులు కొనే వస్తువులేమిటో తెలుసుకోవాలనే పెద్ద జబ్బొకటి వుంది లెండి. బ్లేడ్సు కూడా కొన్నట్లున్నారు?

రాఘు : అవును. అర డజను!...మీరేమీ కొన్నట్లు కన్పించదే!

ఆమె: ఏం కొనేది? ఒక లిప్‌స్టిక్ చూశాను...చాలా బాగుంది...మూడు రూపా యలట...అక్కడే పారేసి వచ్చేను!

రాఘు: (లాగు జేబులోంచి చిన్న పేకెట్ తీసి) అరుణోదయంట! అర్థంలేని పేరు! (ఇస్తాడు)

ఆమె: వాకోసమే?

రాఘు: లిప్ స్టిక్ వుపయోగించే అలవాటు నాకు లేదుగా! (ఆమె సంకోచిస్తుంది) ఫరవాలేదు తీసుకోండి.

ఆమె: (తీసుకుంటూ) థాంక్స్! అయితే మీరు కూడా నన్ను కనిపెడుతున్నా రన్న మాట?

రాఘు: ఈ వస్తువులు పాక్ చేసేలోపల మగడైనవాడు ఎటో అటు చూడక తప్పదుగా!

ఆమె: అప్పుడైనా పలకరించక పోయేరా?

రాఘు: ఏ వంకతో పలకరిద్దామా అని నేను ఆలోచించుకుంటూండగానే మీరు తప్పించుకు పారిపోయేరు.

ఆమె: అబద్ధం! నేను పారిపోలేదు.

రాఘు: మరైతే వక్కసారైనా వెనక్కి తిరిగి చూడలేదేం?

ఆమె: (ఆగి, ఆలోచించుకొని, నవ్వుతూ) అకస్మాత్తుగా, ఏదో అర్థాంతర వ్యవ హారం గుర్తొచ్చినట్లు పరిగెత్తేను కదూ?

రాఘు: బహుశా నన్ను ఫూల్‌ని చెయ్యాలని అయి వుంటుంది.

(ఒకరి నొకరు చూసు కుంటారు, చిర్నవ్వులు)

ఆమె: ఫాన్సీ షాపులదగ్గ మగాళ్లకేసి చూసి నవ్వడం నా కలవాటు లేదు.

రాఘు: పోనీ బయటికొచ్చిన తర్వాత, నవ్వితే అరిగి పోతారా?

ఆమె: అంత 'సీరియస్'గా కన్పించేనా?

రాఘు: సీరియస్! మాట్లాడిస్తే కరిచేటట్లున్నారు!

ఆమె: (ముందు కొచ్చి మేడ మీద నుండి క్రిందకు తొంగి చూస్తూ) చూడండి! ప్రకృతి సౌందర్యం ఇక్కడినుంచి ఎంత ఆకర్షణీయంగా వుందో?

రాఘు: (ముందుకొచ్చి చూచి) చీకటి పడుతూంది...ఏం కన్పిస్తూంది?

ఆమె: 'గిర్‌గాం' అంతా.

రాఘు: మీకు మతి పోయివుండాలి. మసక వెల్తురులో ఏం కన్పిస్తూంది అక్కడ?

ఆమె: (మొండిగా) నా కంతా కన్పిస్తోంది.

రాఘు. అసలు టాజ్ హోటలే కన్పించటం లేదు.

ఆమె: నాకు కన్పిస్తోంది.

రాఘు: మీకు కొంచెం...(తల చూపిస్తాడు)

ఆమె: ఏమీ లేదు. నాకొక్కవలసిం దేదో నేనూహించుకోగలను.

రాఘు: అయితే ఇంతదూరం వచ్చావెందుకు? ఇంట్లో కూర్చునే అన్నీ వూహించుకో వచ్చుగా!

ఆమె: కాదు. ఇక్కడే చాలా బాగుంది మీరే ఆలోచించండి. ఇంత ఎత్తుమీద నుంచి, ఇంత చల్లటి గాలిలో, ఇంత ప్రశాంతమైన నిశ్శబ్దంలో, ఈ సౌందర్యం చూస్తూంటే వళ్లు పులకరించడం లేదూ మీకు?

రాఘు: సారీ. మరచిపోయే...(జేబులోంచి నాల్గు చాక్‌లెట్స్ తీసి రెండామె కివ్వబోతూ) మీ కిష్టమేమోనని కొన్నా...

ఆమె: (తీసుకుని) థాంక్స్! నా పేరైనా తెలియదు మీకు; నా పైన ఇంత అవ్యాజానురాగం చూపుతున్న మీకు నా కృతజ్ఞత ఎట్లా తెల్పాలో అర్థం కావడం లేదు.

రాఘు: ఓ పని చేస్తారూ?

ఆమె: (సందేహంగా చూచి) చెప్పండి—చూద్దాం.

రాఘు: మరేం లేదు. నా పేరు చెబుతా గాని, నన్ను అండీ అని పిలవకండిక. మిమ్మల్ని నేను అండీ అనను. సరేనా?

ఆమె: సరే, నా పేరు 'ఉష'. మీ పేరు 'మోహనా?'

రాఘు: కాదు. రాఘవరావు.

ఆమె: (కుడివైపుకొచ్చి) ఓ...ఇక్కడినుంచి చూడండి-సారీ—చూడు! ఎంత అందంగా వుందో (బైనాక్యులర్స్ తీసుకుంటుంది)

రాఘు: మా ఆఫీసు ఇక్కడే! ఇప్పటికీ మ్యూజియం నేనో వందసార్లయినా ఎక్కాను...నేనొకటి చెబుతాను వింటావా ఉషా?

ఆమె: (అతని బైనాక్యులర్స్‌లో నుంచి చూస్తూ) అబ్బ! నువ్వట్లా మాట్లాడుతూంటే నేనేం చూసేది?

రాఘు: (నెమ్మదిగా అతను ఆమె భుజంమీద చెయ్యి వేస్తాడు-'ఉష' మొగ్గుబారుతూన్నట్లు అవుతుంది. బైనాక్యులర్స్ తీసేసి ఏమీ జరగనట్లే మామూలుగా చూస్తుంటుంది) అవును. నిజంగా చాలా అందంగా వుందిసుమా! (ఆమె ముఖంలో బాధ అవుపిస్తూ వుంటుంది. కొంచెం ప్రక్కకు జరుగుతుంది. ఆమె ముఖంలోకి చూచి) ఏమిటట్లా వున్నావు ఉషా?

ఉష: నాకు ఏడుపొస్తోంది.

రాఘు: ఏడుపా? ఎందుకు?

ఉష: (కుడివైపుకి దూరంగా చూపుతూ) ఆ ప్రజలంతా...

రాఘు: ఏ ప్రజలు?

ఉష: 'గిర్‌గాం' లోని ప్రజలంతా...

రాఘు: (మరోవైపు చూపి) 'గిర్‌గాం' ఇటు వైపుంది.

ఉష: ఎలాగైనా వుండనీ! నాకేదుపు వస్తోంది.

రా: ఎందుకూ?

ఉష: వాళ్ళంతా తిండి లేక మాడి పోతూన్నందుకు.

రాఘు: అనవసరంగా 'అబ్బాస్'లా మాట్లాడకు. బయట చీకటి పడిపోయింది. దిగి పోదామా?

ఉష: వద్దు. నాకిక్కడే బావుంది.

రాఘు: (కొద్దిగా వణికి) నీకు చలి వెయ్యడం లేదూ?

ఉష. వేళ్ళు మాత్రం కొంకర్లు పోతున్నాయి...నాకు ఆవేశం వచ్చినప్పుడల్లా అంతేలే!

రాఘు: ఇప్పుడు నీకు ఆవేశం రావలసినంత ప్రమాదం ఏం జరిగింది?

ఉష: ఇంత ఎత్తయిన ఈ మ్యూజియం మేడమీదికి రావడం! ఇక్కడికి రావాలని ఎన్నాళ్ళనుంచీ ప్రయత్న మనుకున్నావ్?

రా: మరెందుకు రాలేక పోయేవు?

ఉష: నిజం చెప్పాలంటే, చూస్తూ చూస్తూ రెండు రూపాయలు ఖర్చు చేయలేక నే! పైగా ఇది బోలెడు దూరం! ఇవ్వాళ ఎందుకో, ఏమైనాసరే పూరిమీద దండెత్తుదా మనిపించింది...అంతే!

రా: చాలా మంచి పనే చేశావు.

ఉష: నిజంగానే అంటున్నా! ప్రజలకోసం కట్టించ బడిన ఈ మ్యూజియం చూడడానికి రెండు రూపాయలు టిక్కెట్టా? మనదేశంలో కమ్యూనిజం వ్యాపించిందంటే ఈ వక్క కారణం చాలు!

రా: రష్యాలోని 'క్రెమ్లిన్' చూడడానికి, స్టాలిన్ ఏమీ ఛార్జి చెయ్యకుండా వదిలే డంటావా?

ఉష: (ఆగి, సీరియస్‌గా) నాకా ఆలోచన తట్టనే లేదు సుమా! ఎంత ఛార్జి చేశాడంటావు?

రా: ఏమో నాకేం తెలుసు? నేను చూసేనా?

ఉష: ఇది మనం ప్రత్యక్షంగా చూస్తున్నాంగా!

రా: నీకు ఆకలిగా లేదూ?

ఉష: మాడి పోతూంది!

రా: క్రిందకు వెళ్ళి ఏమైనా తిందాం—రా.

ఉష: (అడ్డంగా తలూపి) అక్కర్లేదు.

రా: ఏం?

ఉష: ఇప్పటికే నాకోసం బోలెడు ఖర్చు చేసేవు.

రా: పిచ్చిగా మాట్లాడకు.

ఉష: నిజమే! సిల్లీ ఏముంది? నాకోసం లిప్‌స్టిక్, చాక్‌లెట్...

రా: అంతే లే, ఇంకేమీ లేవు. నా మాట విని భోజనానికి వెళ్దాం రా.

ఉష: ఎక్కడ?

రా: నీ యిష్టం వచ్చిన హోటల్లో!

ఉష: హోటలా? అరేం?

రా: అంతే అది. చెప్పు. ఎక్కడికి వెళ్దాం?

ఉష: టాజ్ హోటలుకి వెళదామా?

రా: అలాగే!

ఉష: నీకు మళ్ళీ చాలా ఖర్చును కుంటాను.

రా: ఎవరో వకరు ఖర్చు పెట్టక పోతే ఆ హోటలువాళ్లు ఎట్లా బతుకుతా

ఉష: చాలా బాగుంటుందంటారు ఆ హోటలు?

రా: ఆ! అక్కడికి నేను నాలుగైదు సార్లు వెళ్లానంతే. సాధారణంగా సినిమాల వాళ్లంతా వస్తూంటారు అందులోకి.

ఉష: సాధారణంగా ఇరానీ హోటల్స్‌కి వెళ్తూంటాను నేను.

రా: ఊ—రా. ఇక పోదాం;

ఉష: ఇంత పెందరాళేనా?...నాకంత ఆకలి వెయ్యటం లేదు.

రా: ఇందాక నేగా మాడి పోతూందన్నావు. పోనీ...ముందు మాయింటికి వెళ్ళి కాస్త షర్బత్ తాగి, కొంచెంసేపు కూర్చుని మరీ భోజనానికి వెళదాం ..ఏం? (ఆగి) మా యిల్లు చూసినట్లుకూడా వుంటుంది.

ఉష: మీ యింటికా? (రాఘవరావును ఎగా దిగా చూసి) మరేం ప్రమాదం వుండదు కదా?

రా: ఎవరికి? నీకా? ఏమో ఎట్లా చెప్పగలను? అయినా అట్లా అడిగేవెందుకు?

ఉష: ఆడవాళ్లు అట్లాంటి విషయాలు ముందే తెల్సుకోవాల్సిన అవసరం వుంది గనక.

రా: ఆడవాళ్ళెప్పుడూ ఇటువంటి విషయాలు మగాడి మనస్సును బట్టి గ్రహించాలి గాని, నిర్మొగమాటంగా అట్లా అడగొచ్చా?

ఉష: ఆ! నేను అడుగుతాను. ఎప్పుడూ అడుగుతాను.

రా. అయితే 'అవునని' సమాధానం వస్తే ఏం జరుగుతూంటుంది?

ఉష: వాళ్ళమాట నిజమేనని నమ్మి నా తోవను నేను పోతాను.

రా: 'నా కటువంటి దురుద్దేశాలు లేవని' చెబితే?

ఉష: అప్పుడూ వాళ్ల మాట నమ్ముతాను. కాని ఒకోకప్పుడు, వాళ్ల మాటలుకూడా అబద్ధాలని తేల్తాయి. అటువంటి మనుష్యులంటే నా కసహ్యం!

రా: సరే—నేను చాలా మర్యాదగా ప్రవర్తిస్తాను. నాపైన విశ్వాసం వుంచుతావు కదూ?

ఉష: (అతన్ని దీర్ఘంగా చూసి, తలూపి) నువ్వు అందరి లాటివాడివి కావు. చాలా మంచి వాడివి.

రా: ఏమో నేను అబద్ధ మాడుతున్నానేమో?

ఉష: అవును సుమా! నువ్వు అబద్ధ మాడుతున్నావా? నిజం చెప్పు!

రా: ఒక్క సంగతిమాత్రం నిజం ఉషా! నీలాంటి అమ్మాయితో పరిచయం అవడం మాత్రం ఈ జీవితానికి ఇదే మొదటిసారి.

ఉష: (ఆనందంగా) ఊఁ—!

రా: నువ్వు నిజంగానే ఇంతేనో, లేకపోతే నన్ను వెర్రాణ్ని చెయ్యాలని చేస్తున్నావో నాకర్థం కావడం లేదు.

ఉష: అర్థం కాకపోవడానికేముంది? (నిర్దాక్షిణ్యంగా) మగాళ్ళతో వాళ్లింటికి వెళ్లడమంటే ఆడదానికి రెండే అర్థాలు. ఒకటి, ఆమె అతనికి లొంగిపోవడానికైనా యిష్టపడి వుండాలి. లేదా యుద్ధానికైనా సిద్ధమయి వుండాలి. అందుచేత నేను ముందే నిర్మొగ మాటంగా మాట్లాడుతూంటా. ఏం? మంచిది కాదూ?

రా: మంచిదే! 'ప్రేమేగాని, మోహంకాదు' అదే నా మతం. అదే నామాట కూడాను.

ఉష: 'ప్రేమే గాని మోహంకాదు' ఎంత బావుంది! ఆ స్లోగన్‌తో నువ్వు వచ్చే ఎలక్షన్లకి ఎందుకు నిలబడ కూడదూ?

రా: (నవ్వుతూ ఆమెని చేతితో లాగి) నీకు కొంచెం 'న్యూరో' టచ్ అయినా మంచి లక్షణాలు చాలా వున్నాయి సుమా!

ఉష: నా వన్నీ మా నాన్నగారి లక్షణాలే నట!

రా: మీ నాన్నగా రేం చేస్తూంటారు?

ఉష: పోలీసు యిలాఖాలో పని చేసే వారు.

రా: ఓ! అల్లా చెప్పు. మీది చాలా పెద్ద కుటుంబ మేమిటి?

ఉష: లేదు. నే నొక్కర్తె నే! నా చిన్నతనంలోనే పోయింది మా అమ్మ!

రా: అలాగా, పాపం!

ఉష: అన్నట్టు—నీకు పెళ్ళయిందా?

రా: లేదు.

ఉష: మంచిపనే? ఇప్పుడప్పుడే చేసుకోకు... చదువు అయిపోయినట్లేనా?

రా: ఆఁ—రెండేళ్ళ క్రిందటే ముగిసింది.

ఉష: అందుకనేనా కన్పించడం లేదు! ఇప్పు డుద్యోగమా?

రా: ఆ... చిన్న ఇంజినీర్.

ఉష: ఓ! అందుకనా 'ఇండియన్ ఇంక్' కొన్నావు! ఏం ఇంజినీర్?

రా: బిల్డింగ్ ఇంజినీర్! నువ్వు నమ్ము నమ్మకపో. ఎటువంటి బిల్డింగు అయినా సరే

సినీమా హాలు దగ్గరనుంచి, 'స్కై స్క్రేపర్' వరకూ మనం కట్టించి పారెయ్యగలం!

ఉష: కాస్త లాభసాటిగా వుండేదేనా బిజినెస్? చాలా వదిలింది నీకీ పూట!

రా: నీలాంటి వెర్రాళ్లు కావాలన్నా రోజూ దొరుకుతారా?

ఉష: నాకు వెర్రని నువ్వు నిజంగా అనుకుంటున్నా వేమిటి కొంపతీసి?

రా: అబ్బే లేదు. నవ్వుకూ అన్నాను. నాకు ప్రశాంతమైన జీవితం యిష్టమని తెల్సుకునే తెలివి నీకుంటే చాలు.

ఉష: నాకూ ప్రశాంతమైన జీవితం అంటే చాలా ఇష్టం...కాని ఈ వయస్సులో ఏది మంచో ఏది చెడో తెల్సుకోడం అంత సులభం కాదు చూడు! అందుకని చేతి కందినవి తీసుకోడమే పని, మంచివే దొరుకుతాయని ఆశిస్తో...!

రా: ఉదాహరణకి?

ఉష: ఒక ఉద్యోగం! లేకపోతే వివాహం అనుకో! లెక్కలేనన్ని సంబంధాలు


పని చేయదని రుజువు చేసిన పైకం వాపసు చేస్తాం.

## కాయకల్ప

(జీవ రసాయనం)

24 గంటలలో మలబద్ధం మూత్రపు జబ్బులు!
3 రోజులలో చిగుళ్ల రక్తం, రక్తం పడు వ్యాధులు!
5 రోజులలో అత్యుష్ణం నిస్సత్తువ, రక్త క్షీణం!
7 రోజులలో సమస్త జీర్ణమండల వ్యాధులు!
10 రోజులలో కీళ్ల జబ్బులు, నరాల బాధలు!
12 రోజులలో పుంస్త్వ దోషం, ఋతుదోషాలు!
15 రోజులలో గుండె జబ్బులు, మెదడు వ్యాధులు!
20 రోజులలో అన్నిరకాల బలహీనతలు!

గ్యారంటీగా తగ్గిపోతాయి;

పూర్తినివారణకు 40 రోజులు సేవించాలి.

(పథ్యం, అనుపానాల ప్రయాసలు లేవు.)

స్ట్రాంగ్ రు. 20/- ఎక్స్ట్రా స్ట్రాంగ్ రు. 50/-

సేవాసదన్, :: గుంటూరు-1.

తెస్తున్నాడు మా నాన్న, కాని నా ఆశయాలకి అనుగుణ్యంగా వుండేవ్ని దొరకడం అంత సులభం కాదు. పెళ్ళి కొడుకులు చిత్ర కాయల్లా చెట్లకింద రాలరు చూడు!

రా: పోనీ మ్యూజియంలో తిరుగుతూంటారేమో!

ఉష: (నవ్వుతూ) మరేం దిగులు పడకు. నేను వెతికేది నీలాంటి పెళ్ళి కొడుకు కోసం కాదులే!

రా: కాదా?

ఉష: కాదు...ఏదో గంపెడాశతో పలకరించేవు. మాట్లాడకపోతే బావుండదనిపించింది...మాట్లాడేను. అంతే! నేను నిజంగా పెళ్లే చేసుకోవాల్సి వస్తే గుండెలతో డబ్బున్న మాంఛి మధ్యవయస్కుడిని పెళ్ళాడుతాను.

రా: నాకేమాత్రం రొమాంటిక్‌గా వినిపించడం లేదు.

ఉష: నాకేం రొమాన్స్ అక్కర్లేదు. 'ప్రేమ, ప్రేమ' అని చంపుకుతినే పూజార్లకంటె నన్ను మెచ్చుకొని పడిచచ్చేవాళ్ళంటే ఇష్టం.

రా: కొంపతీసి నేను పూజారిలా అవుపిస్తున్నానా?

ఉష: (తగ్గి) అవును. అట్లాగే కన్పిస్తున్నావు. నామట్టుకు నాకు ప్రేమించడమే ఇష్టం, ప్రేమించబడటం కంటె...

రా: నీవయస్సెంత వుంటుందేం?

ఉష: ఓటు వయస్సు కాదు—ఓటు వేసే వయస్సే లేదింకా!...ఎవరికి కావ్యాలో ఎందుకు కావ్యాలో తెలిసినా! ఆ మాటకొస్తే ఈ అమాయక ప్రజల్లో ఎంతమందికి తెలుసు ఓటు విలువ? ఈ ప్రజల సంగతి తల్చుకుంటే నాకు ఏడుపొస్తోంది రఘూ!

రా: మళ్ళీ ఆ 'అబ్బాస్'ని రుద్దుతున్నావూ? ఆకలేస్తోంది పోదాం రా!—

ఉష: (బరువుగా) సరే! ముందు నువ్వు నడు...

రా: నీకేమైనా భయంగాని అనుమానంగాని వుంటే మట్టుకు రావద్దు సుమా!

ఉష: నిర్భయంగా, నిస్సందేహంగా వస్తున్నా. సరేనా?

రా: నువ్వు నన్ను కల్సుకొని పావుగంటైనా దాటలేదు—నన్నంత గాఢంగా ఎట్లా నమ్మగలవు?

ఉష: ఎవరిని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో, ఆడవాళ్లకి బాగా తెలుసులే.

రా: నువ్వు నిజంగా చాలా మంచిదానివి సుమా!

(చెయ్యి పట్టుకొని కుడివైపుకు లాక్కొని వెళ్ళిపోతాడు)

## 2

బొంబాయిలో మాతుంగలో ఒక మేడలో రెండవ అంతస్తు. రాఘవ రావు వుండే భాగంలో ఒక గది. గది విశాలంగా వుంటుంది. ఎడమ వైపు ద్వారం నుంచి పడక గదుల లోనికి, కుడి వైపు ద్వారంలోంచి వంటింటి లోనికి త్రోవ లుంటాయి. గది మధ్యన ఒక టేబిలు. దానిపైన ఫ్లాస్కు, పత్రికాలు, బ్లూ ప్రింట్సు, టెలిఫోన్ వుంటాయి. గదిలో ఇంకా రెండు మూడు పెద్ద సోఫా లుంటాయి. ఒక సోఫా మీద ఉష జార్లగిలబడి ఒక బ్లూ ప్రింటును చూస్తూ వుంటుంది. గదిలో ఒక గోడకి ఒక అందమైన అమ్మాయి ఫోటో - స్టూడియో పోజ్‌లో - వ్రేలాడుతూ వుంటుంది. టెలిఫోన్ గణ గణ మోగుతుంది]

ఉష: (వంటింటి వైపు చూస్తూ) రఘూ! టెలిఫోన్ — (నిశ్శబ్దం) నేను ఆన్సరు చెయ్యవచ్చా! (రఘు కుడివైపు గదిలోంచి వస్తాడు. చేతిలో సీసా, గ్లాసులు, వుంటాయి. షర్బత్ తయారుచేస్తూ వుంటాడు. సీసా, గ్లాసులు బల్లపైపుంచి)

రా: ఎందుకు! వచ్చేసేగా! (ఫోనులోకి) హల్లో! రమణా...సారీ మిత్రమా! ఇంకో సారి, ఇవాళ అనుకోని అవాంతరం ఒకటి వచ్చింది. ష్యూర్—వచ్చేవారం వెళ్దాం. గుడ్ బై! (ఫోను పెట్టేసి షర్బత్ చేస్తూంటాడు)

ఉష: రమణ ఎవరు?

రా: నా స్నేహితుడు.

ఉష: అతనికీ నీకూ అష్టే పడదా ఏమిటి?

రా: ఏం అల్లా అడిగేవు?

ఉష: అబ్బే ఏం లేదు. ఫోను అంత చిరాగ్గా వదిలేస్తేను.

రా: ఆఁ! మాట్లాడేదేం లేదులే. అతనితో కలిసి భోజనం చెయ్యాలట. వీలు లేదని చెప్పేను.

ఉష: అయినాగాని కాస్సేపు మాట్లాడ వచ్చునుగా! నేనయితే గంటల తరబడి మాట్లాడతా నా స్నేహితులతో.

రా: సరే! (చుట్టూ చూసి) ఎక్కడ పెట్టేను రెండో గ్లాసు?

ఉష: అదిగో ఆ టేబిలుపైన, (బ్లూ ప్రింటు తెరచి చూపుతూ) ఇది చాలా అద్భుతంగా వుంది. ఏమిటిది?...ఓ గ్రౌండు ప్లాను...వసంత మహల్...ఇంజనీర్......కె. ఆర్. రావు. నువ్వే కదూ? నిజంగా చాలా గొప్పవాడివా ఏమిటి నువ్వు?

రా: అబ్బే! ఇంకా అంతవరకూ రాలేదు. మామూలు ఇంజనీర్ నే! (ఇంకో బ్లూ ప్రింట్ ఇస్తూ) ఇది చూడు...ఇంకా బాగా అర్థమవుతుంది.

(ఉష తీసుకుంటుంది. అతను ఆలోచిస్తూ షర్బత్ కల్పుతూనే వుంటాడు చెంచాతో)

ఉష: (ప్లాను తెరచి చూచి) ఓ—చాలా అద్భుతంగా వుంది. తయారయిపోయిందా ఈ మేడ?

రా: లేదు. తయారవుతోంది.

ఉష: నీ చేతితో చాలా తయారయ్యాయా ఇట్లాంటివి?

రా: అప్పే చాలా తక్కువ. మొదట్లో ఒక పెద్ద కంపెనీలో వుండేవాణ్ని. ఈ మధ్య విడిపోయి స్వంతంగా నేనే చూచుకుంటున్నా.

ఉష: నువ్వు కట్టించిన బిల్డింగ్‌ని చూస్తూంటే, నీకు చాలా ఆనందంగా వుంటుంది కదూ?

రా: షూర్. నీకో రహస్యం చెప్పనా? మొట్ట మొదట నేను స్వతంత్రంగా ఓ ప్లాను గీశాను. అంతా తయారయ్యాక చూస్తే. తీరా తయారయింది ఓ గుడిసెలాంటి కొంప. అబ్బ ఎంత అసహ్యంగా వుందనుకున్నావు! దాన్ని తల్చుకుంటే నాకే నవ్వు వస్తుందిప్పుడు. కానీ ఆ రోజుల్లో అర్ధరాత్రివేళ కూడా, నే నొక్కణ్ణే అక్కడికి వెళ్లి, ఆ యింటివైపే చూస్తూ గంటలకొలదీ గడిపి వేసేవాణ్ణి!

ఉష: ఒంటరిగానే?

రా: ఒంటరిగానే! మరెవ్వరూ కన్నెత్తికూడా చూసేవారు కాదా యిల్లు!

ఉష: అటువంటి సమయాల్లో మరెవ్వరైనా ప్రక్కనుంటే ఇంకా బాగుంటుం దనుకుంటా.

రా: అవొచ్చు. నీకో గ్లాసు అక్కర్లేదూ?

ఉష: అమ్మ—అశే! ఇట్లా తే అది (తీసుకొని) నాకు నచ్చింది ఇల్లు. ఇంత పెద్ద భాగంలోనూ నువ్వు వంటరిగానే వుంటున్నావా?

రా: ఏం తప్పా?

ఉష: (తాగుతూ) తప్పని కాదు. ఈ ఇంట్లో రెండు పడక గదులు చూపించావే, ఒక్కడికి రెండెందుకా అని?

రా: ఒకటి అతిథులకు, అప్పుడప్పుడు స్నేహితులెవరైనా వస్తూంటారు చూడు!

ఉష: ఓ...(ఆగి) నీ ప్రేయసి పేరేమిటి?

రా: (తబ్బిబ్బై) అటువంటి వాళ్ళున్నారని చేసన్నానా!

ఉష: నీ కిష్టంలేకపోతే చెప్పొద్దులే!

రా: నా కెవరూ లేరు.

ఉష: ఎందుకు లేరు! ఇష్టంలేకపోతే చెప్పకు...

రా: సంకటంలో పడవేసే ప్రశ్నలు వేస్తావు సుమా!

ఉష: నువ్వు బ్రహ్మచారివి గనక అట్లా అడిగేను (గోడమీది ఫోటో కేసి చూపి) ఎవరా అమ్మాయి?

రా: ఓ...ఆ అమ్మాయా? నిర్మల.

ఉష: అందంగా వుంది. (దగ్గరికొచ్చి ఫోటో చూస్తూ) చాలా అందంగా వుంది. నువ్వా అమ్మాయిని ప్రేమించావా?

రా: (నిర్లక్ష్యంగా) అవును...ఒకప్పుడు.

ఉష: అయితే ఇంకా ఎందుకా ఫోటోని అక్కడే వుంచావు?

రా: ఆ అమ్మాయి ఇచ్చింది గనక.

ఉష: ఆ అమ్మాయి ఇంకా నిన్ను ప్రేమిస్తూనే వున్నట్లుంది. పాపం!

రా: ఏమో! ఆ విషయం నే నెలా చెప్ప గలను?

ఉష: ఒక యువకుడికో అమ్మాయి, ఫోటో ఇచ్చిందంటే దాని అర్థం అంతే!

రా: అవునేమో నాకు తెలియదు.

ఉష: పెళ్లి మాటలు జరిగేయా?

రా: (విచారంగా) ఇంచు మించు జరిగినట్లే.

ఉష: (సానుభూతిగా) ఓ—ఎంత విచారకరమైన విషయం! (ఫోటోవంక మళ్ళీ చూసి) ఎంత అందంగా వుంది! ఆమెని...?

రా: ఆమెని నేను పెళ్ళి చేసుకో దలుచుకో లేదు....

ఉష: చేసుకుంటావని నే నన్నానా?

రా: అనబోయేది అదేగా!

ఉష: కాదులే!...చికాకు పడకు. (ఉత్సాహంగా) అసలు ప్రధానం అయిందా?

రా: ఏమీ లేదు.

ఉష: మాటలయినా జరిగేయా!

రా: జరిగినా జరగనట్లే!

ఉష: ఏం? కథ ఎక్కడడ్డం తిరిగింది?

రా: గతరాత్రి నుంచి. కరెక్టుగా చెప్పాలంటే ఇవ్వాళ వుదయం నుంచీ.

ఉష: చ్...చ్...చ్ పాపం! నీకేమీ దిగులుగా లేదూ? ఏదైనా మాట పట్టింపువస్తే నాకా రోజల్లా దిగులుగానే వుంటుంది.

రా: (ఏమీ లేనట్లు తలూపు తాడు)

ఉష: ఆమెమీద అసలు నీకు రవ్వంతైనా ఇష్టం వున్నట్లు కన్పించదే?

రా: నేనూ అదే ఆలోచించుకొని ఆశ్చర్య పడుతున్నాను.

ఉష: మరెందుకా విచారం?

రా: నేనేమీ విచారంగా లేనే!

ఉష: గదిలో నేమో ఆ అమ్మాయి ఫోటోని అలాగే వుంచావే, ఆమె నింకా ప్రేమిస్తున్నావా అంటే తప్పించుకుంటున్నావు?

రా: (వ్యంగ్యంగా) నా హృదయాన్ని అంధకారమయం చేసి వెళ్ళిపోయిందామె. పరేషా?

ఉష: ఓ! అయితే నీ విచారం మఱచిపోవడానికేనా నన్నిక్కడికి తీసుకొచ్చావు?

రా: అలానే అనుకో పోనీ!

ఉష: పోన్లే గాని, మీ కెందుకొచ్చింది, పేచీ అసలు?

రా: అబ్బబ్బ! ప్రాణం తీస్తున్నావు నీ ప్రశ్నలతో.

ఉష: సారీ! (ఫోటో వంక మళ్ళీ చూసి కృత్రిమంగా) చక్కటి ముఖారవిందం!

రా: ముఖమే కాదు—

ఉష: (అడ్డొచ్చి) అట్లాగా...అయితే నీకు ఆమె...

రా: ఆమె నాకు అటువంటిదేమీ కాదని ఇందాకే చెప్పాను.

ఉష: అహాఁ—నువ్వన్నమాటలు బట్టి—

రా: అయినా నీకీ ఆలోచన లేమిటి!

ఉష: నాకా?

రా: అవును. నీకే!

ఉష: నిజంగా నేనే అట్లా ఆలోచిస్తున్నానంటావా?

[ఇంకా వుంది]

ముఖ్య గమనిక

# చిత్రసీమ

జనవరి, జన్మదిన సంచికనుంచి, చిత్రసీమ సరి కొత్త పోకడలతో, కొత్త శీర్షికలతో, అత్యంతాకర్షణీయంగా డిసెంబర్ నెలా ఖరుకు వెలువడుతుంది.

నేడే మీ కాపీని రిజర్వు చేసుకోండి.

వివరాలకు:

చిత్రసీమ కార్యాలయం

మద్రాసు_17